# పెద్దపులులు

అమెరికాలో గత పదేళ్ళల్లో స్కూలుకి వెళ్ళే పది, పదమూడేళ్ళ పిల్లల్ని మాయం చేసి, లైంగికంగా బలాత్కారం చేసి, చంపేసి అక్కడా ఇక్కడా పారేసిన కేసులు మూడు నాలుగు జాతీయ వార్తల్లో ప్రధానంగా చోటు చేసుకున్నాయి.

ఎందుకు అంత పసిపిల్లల్ని చంపారు? ఎవరు? అనేది చాలమందిని, అటు పోలీసు అధికారుల్లో, మీడియాలో, అన్నిటికన్నా ఎక్కువగా ప్రజల్లో చాల కలవరం లేపింది. వెంటనే వేట మొదలు పెట్టారు. దాదాపు అందరు హంతకులనీ పట్టుకో గలిగారు. ఇంకా ఇలాటవి జరగకుండా ఏం చేయాలి అని ఆలోచించి, అలాటివారిని పట్టుకోవటానికి రకరకాల వేటలు మొదలుపెట్టారు.

0 0 0

ఇంతకుముందు 'లా ఒక్కింతయు లేదు' అనే కబుర్లలో చెప్పుకున్నాం. టెక్సస్‌లో ఇలాటి వేటలో 40 మందిని పట్టుకున్నారని. ఈ నలభై మందీ ఇంటర్నెట్ చాటింగ్‌లో మైనర్ పిల్లలతో తమకి వాళ్ళతో కామకేళి కార్యాలు చేయాలని వుందని చెప్పటం, చెప్పటమే కాక ఎన్నో మైళ్ళు డ్రైవ్ చేసుకుంటూ ఇంకొక వూరికి వెళ్ళటం, అక్కడికి వెళ్ళగానే పోలీసులు వాళ్ళని పట్టుకోవటం చకచకా జరిగిపోయాయి.

వాళ్ళకి అప్పుడే తెలిసింది అది పోలీసులు పన్నిన వల అని. ఆ వల వారందరికీ జైలు జీవితం అయింది. ఐదేళ్ళనించీ పదేళ్ళదాకా. ఇక్కడ మనకి బాధ కలిగించే విషయం ఏమిటంటే, ఆ నలభై మందిలో 16 మంది భారతీయులు. వారిలో నలుగురు హైద్రాబాదీయులు. పెళ్ళికూడా చేసుకుని పిల్లలున్న వాళ్ళు ఇలాటి పనులు చేశారు. చేస్తున్నారు. దీనివల్ల ఇటు వారి కుటుంబాలు భిన్నాభిన్నమవటమే కాక, ఎంతో చదువు చదువుకుని కష్టపడి ఉద్యోగాలు సంపాదించుకుని, సుఖంగా వున్న జీవితం రోడ్డున పడింది. అంతేకాదు వాళ్ళు జైల్లోనించీ బయటికి రాగానే సరాసరి ఇండియాకి విమానం ఎక్కిస్తారు. మళ్ళీ అమెరికాలోనే కాక, అమెరికా మిత్ర దేశాల్లో కూడా, కనీసం యాత్రీకులుగా కూడా అడుగుపెట్టే అవకాశం వుండదు.

ఇక్కడ ఎన్‌బిసి అని ఒక టీవీ ఛానల్ వుంది. అంటే నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్. దాంట్లో డేట్ లైన్ అనే ప్రోగ్రాం, రాత్రి పూట ఒక గంటసేపు వస్తుంది. ఒక్కొక్క వార్తని తీసుకుని డాక్యుమెంటరీలా చూపిస్తారు. దాదాపు రెండు నెలలయిం దేమో ఈ కార్యక్రమం మొదలుపెట్టి. దాని పేరు సెక్స్ ప్రెడెటర్స్. ప్రెడెటర్స్ అంటే వేటాడే పెద్దపులులు. సెక్స్ అంటే పవిత్ర భారతదేశంలో పుట్టిన కామసూత్రాలూ, భార్యాభర్తల మధ్య వుండే అన్యోన్య దాంపత్యమూ కాదు. తెలుగు సినిమాలు తెలుగు వారపత్రికల్లో సినిమా బొమ్మలూ చూసే మనందరికీ తెలుసు ఈరోజుల్లో అదేమిటో.

పైన చెప్పాను కొంతమంది చిన్న పిల్లల్ని సెక్స్ కోసం అపహరించి, బలాత్కా రించి, తర్వాత చంపేసిన కేసులున్నాయని. అటువంటి సెక్స్ కోసం పరితపించే పెద్దపులులని, ఇలాటివి జరగక ముందే పట్టుకోవాలనే ఉద్దేశ్యంతో మొదలు పెట్టిన

కార్యక్రమం ఇది. దీనివల్ల ఇంకో లాభం కూడా వుంది. ఇలా వారం వారం నేషనల్ టీవీలో రాత్రి అందరూ టీవీ చూసే సమయంలో చూపిస్తే, ఇలాటి పెద్దపులులు తోక ముడిచే అవకాశం వుంది. ఈ పెద్దపులులని ఎలా పట్టుకుంటున్నారో చూద్దాం.

మామూలుగా ఇంటర్నెట్లో రకరకాల చాటింగ్ చేస్తుంటారు. చాలమందితో, ముఖ్యంగా ఎన్నారై కబుర్ల అభిమానులతో, వారానికి రెండు మూడు రోజులు చాటింగ్ చేస్తూనే వుంటాను. ఇలా ఎందరో చాటింగ్ చేయటం సర్వసామాన్యమై పోయింది. కాకపోతే ఈ పెద్దపులులు సెక్స్ కోసం వెతుకుతుంటారు. పోలీసులు కాగల కార్యం కోసం, పన్నెండేళ్ళ అమ్మాయిలా నటిస్తూ చాటింగ్ చేస్తారు. వారి వయసు సెక్స్‌లో పాల్గొనటానికి చట్టరీత్యా తక్కువ అని స్పష్టంగా, చాటింగ్‌లో వ్రాత పూర్వకంగా చెబుతారు. అయినా మనవాడు తన కోరికలు వ్రాస్తూ, ఆ అమ్మాయిని ప్రోత్సహిస్తాడు. ఇక ఆ అమ్మాయి... అంటే ముసుగులో వున్న పోలీసాఫీసర్ కూడా ఒప్పేసుకుంటుంది లేదా కుంటాడు. నేను చెప్పిన చోటుకి నువ్వు వస్తావా, నువ్వు చెప్పిన చోటుకి నేను రానా అంటాడు. నేను మరీ చిన్నపిల్లను కదా, ఫలానా రోజున మా ఇంట్లో అమ్మా నాన్నా వుండరు, నువ్వే రావాలనుకుంటే రా అంటుంది. ఇతను తప్పకుండా వస్తాను, నాకు నువ్వు అది ఇస్తావా, ఇది చేస్తావా అంటూ పాటలాటిది వ్రాసి, దాని క్రింద ఫలానా మైకేల్ హారిస్ వ్రాలు అని సంతకం కూడా పెట్టేస్తాడు.

తర్వాత ముహూర్తం రోజు రానే వస్తుంది.

వాళ్ళు చెప్పినచోట అద్దెకు తీసుకున్న ఇంట్లో మన టీవీ రిపోర్టరూ, కెమేరా మన్ రెడీగా వుంటారు, లోపల ఇంకొక గదిలో. టీవీ ప్రేక్షకుల సౌకర్యార్థం ఎన్నో కెమేరాలు కొన్ని రహస్యమైన ప్రదేశాల్లో దాచబడి, మనకి పూర్తి సినిమా చూపిస్తూ వుంటాయి. వెనక గదిలో టీవీ కంపెనీ వారి, సాంకేతిక నిపుణులు శాటిలైట్ ద్వారా జరగబోయే భాగోతమంతా వాళ్ళ స్టూడియోకి పంపించటానికి సిద్ధంగా వుంటారు.

బయట వ్యానులోనించీ సమాచారం వస్తుంది, పెద్దపులి వస్తున్నది అని.

మనకి బయట అమర్చిన కెమేరాల ద్వారా అతను రావటం, కారు పార్క్ చేసి లోపలికి రావటం అన్నీ కనిపిస్తూనే వుంటాయి. గరాజ్ తలుపు తీసే వుంటుంది కనుక, మనవాడు దాంట్లోనించీ సరాసరి కిచన్‌లోకే వచ్చేస్తాడు.

వచ్చి అమ్మాయి చెప్పిన పేరుతోనో, లేదా వేరార్యూ హనీ అనో అంటాడు. లోపలినించీ ఒక ఆడ పోలీసు కానీ, డబ్బులిచ్చి కుదుర్చుకున్న ఒక నటి కానీ 'ఇప్పుడే వస్తున్నాను. అక్కడ డ్రింక్స్ వున్నాయి, కావలసింది తీసుకోండి' అంటుంది.

మనవాడు అక్కడవున్న కోకోకోలాలాటి పానీయాలో, ఇంకాస్త కిక్కిచ్చే సురాపానాలో సేవిస్తూ కూర్చుంటాడు, రాబోయే పన్నెండేళ్ళ అమ్మాయి కోసం.

అప్పుడేమవుతుంది?

చూద్దాం!

0 0 0